# అపాత్రం

వెనుకటికో అపూర్వాపర విశ్వవిఖ్యాత సంగీత సార్వభౌముడుండేవాడు. తన సంగీతంలో స్థావర జంగమ సర్వప్రాణి కోటినీ పరవశింపచేయాలని ఆయనకో తీరని కోరిక వుండేది. నిజానికి ఆయన సంగీతానికి మైమరవని మానవుడు లేడు. ఆయన పాడుతుంటే చెట్లు కదిలిపోయేవని ప్రతీతి.

తన ఈ అపూర్వ శక్తితో, మానవుల్నే కాక, అరణ్యంలోని క్రూర జంతువుల్ని సైతం ప్రభావితం చేసి, వాటినన్నిటినీ సాధు జంతువులుగా మార్చాలనే ఓ చిత్రమైన దృఢ సంకల్పం కలిగిందాయన కోరోజున.

సంకల్పం కలిగిందే తడవుగా తంబురా అందుకున్నాడు. మధ్యమ శృతి ఎత్తుకున్నాడు. మహారణ్య మధ్యానికి మహా ధైర్యంగా బయలుదేరాడు. గానం చేస్తూ పయనించసాగాడు. ఆ మార్గం అంతా సంగీత రసానిల సువాసనలతో గుబాళించసాగింది. సింహమూ, ఏనుగూ,పులీ, మేకా, ముంగిసా, పామూ వంటి జంతువులు సైతం తను పరస్పర ఆగర్భ శత్రుత్వాన్నీ ఆకలినీ కూడా మరిచిపోయి, ఆ గాన మాధురికి పులకించిపోయాయి పులికించి "అయ్యారే అదృష్టం, భళారే మా భాగ్యం" అనుకుంటూ ఆయన వెన్కగ్గా గప్‌చిప్‌గా నడవసాగాయి.

అలా సాగి-సాగి ఒక గృహ, వాకిట కూర్చుని గొంతెత్తి పాడసాగాడు విశ్వవిఖ్యాత సంగీత సార్వభౌముడు.

పులులు, సింహాలు, కొటినాసిగండ్లు, తోడేళ్ళు, నక్కలు, రేకుచుక్కలు, ఎలుగులు, ఏనుగులు, లేళ్ళు, కుందేళ్ళు, నెమళ్ళు, పాములు, దున్నలు, దుప్పులు, జింకలు, కోతులు, ఒకటేమిటి సమస్త జంతుజాలం చెవులు దోరపెట్టుకుని వినసాగాయి.

అన్నిటినీ ఒక కంట ఓరగా గమనిస్తూ, లోలోపల మురిసిపోసాగాడు. సకల సంగీత స్వర సంగమ రహస్య స్థావర సురపతి! అంతలో, ఆ గొంతులో జీరగా ఒక అపశృతి వింటూన్న జంతువులన్నీ బాధగా అంతెత్తుత ఎగిరిపడ్డాయి.



ఆ అపశృతి ఏదో కాదు కీచుమంటూ సంగీత సార్వభౌముడు విడిచిన తుదిశ్వాస! తీరా చూస్తే ఏముంది! ఓ ముసలి చిరుతపులి – సంగీత సార్వభౌముణ్ని ముందరేసుకుని ముక్తసరిగా ఫలహారం చేస్తోంది.

ఒళ్ళు మండిపోయింది సింహసార్వభౌముడికి, చిరుతపులి దగ్గరికి వెళ్ళి దాని భుజం తట్టింది. "ఏమిటి నువ్వు చేసిన పని"? అని అడిగింది. ఆవృద్ధ చిరుతపులి తల తిప్పికళ్ళు చికిలించి, నవ్వుతూ సింహాన్ని చూడసాగింది. పళ్ళల్లో యిరుక్కున్న ఆహారపుటణువుల్ని గోటితో లాక్కుంటూ.

చిర్రెత్తిపోయింది సింహానికి, పంజాతో చిరుతపులి గడ్డం క్రింద మెల్లగా గీరుతూ, " నీకసలు బుద్ధుందా, అంతటి మహానుభావుడిని అలా తినేయటమేనా? మన మీద దయతల్చి ఎవడైనా సంగీత విద్వాంసుడు మళ్ళీ యిక్కడికి వస్తాడంటావా? అంత గొప్ప సంగీతం యిక మన జన్మలో వినగలమా?..... అంటూ యింకా ఏదో అనబోయింది.

వృద్ధ చిత్రకం, మెల్లిగా చెవి వెనక చెయ్యి దొన్నేలాగా ఆనించి ఇలా అంది.

"ఏమి పిదపకాలం రా నాయనా! ఒక్కడికి గొంతు సరిగ్గా పెగల్దు కదా! సింహం కడుపున పుట్టావు, నీకైనా సిగ్గులేదూ! గళం విప్పితే, మహారణ్యం గడగడలాడద్దూ, చెప్పేదేదో గట్టిగా చెప్పి ఏడు! వినబడి చావట్లే!"

విచ్చుకుంటూనే రాలిపోయిన పారిజాతప్పువ్వు, విచిత్రంగా చూసింది చిత్రకం కేసి.